
• నిండుకుండలా ఎస్సారెస్పీ ఇలా..

ఈ ఏడాది ఎస్సారెస్పీకి భారీగా వరద

- జూన్ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 182 టీఎంసీల నీరు రాక
- దిగువకు 108 టీఎంసీలను విడుదల చేసిన అధికారులు
- ఇప్పటికీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- ప్రాజెక్టు పరిధిలో 9.4 లక్షల ఎకరాల సాగు

నిజామాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు పడటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండింది. ప్రాజెక్టు నుంచి వందకు పైగా టీఎంసీ నీళ్లను గోదావరికి విడుదల చేశారు. వర్షాకాలం ఆరంభంలో వర్షాలు లేక రైతులు ఆందోళన చెందగా ఆగస్టు నెలలో పడిన వర్షాలతో రైతులకు భరోసా వచ్చింది. ఒకేసారి ప్రాజెక్టు నిండటంతో రెండు పంటలకు ఢోకా లేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాజెక్టుకు జూన్, జూలై నెలల్లో తక్కువ వర్షాలు పడటంతో ఓ మోస్తారు వరద రాగా ఆగస్టు చివరి వారంలో పడిన భారీ వర్షాలతో ప్రాజెక్టు నిండింది. ఎగువన మహారాష్ట్రలో పడిన వర్షాలతో అక్కడ గోదావరిపై ఉన్న ప్రాజెక్టులన్నీ నిండటంతో భారీగా వరద వచ్చింది. ఆగస్టు చివరి వారంలోనే ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. ఇప్పటికీ ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండగా ఎస్కేప్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తూ విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. శ్రీరాంసాగర్ దిగువన ఎల్లంపల్లి ప్రాజెక్టు మినహా ఇతర భారీ ప్రాజెక్టులు లేకపోవడం వల్ల వచ్చిన వరద కూడా సముద్రంకే వెళ్తుంది. ఎగువన ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో అధికారులు ఆయకట్టుకు మళ్లిస్తున్నారు. పంటలకు సాగునీటిని అందిస్తున్నారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు నిండటంతో రెండు పంటలకు ఢోకా లేని పరిస్థితి ఏర్పడింది.

భరోసా నింపిన వర్షాలు..

ఆగస్టులో వర్షాలు పెరగడం వల్ల వరద కొనసాగగా ప్రాజెక్టులో క్రమేపి నీటిమట్టాలు పెరిగాయి. ప్రాజెక్టుకు వస్తున్న వరదతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొనగా ఆగస్టు చివరలో పడిన వర్షాలు భరోసా నింపాయి. ప్రాజెక్టుకు భారీ నుంచి అతి భారీ వరద రావడంతో నిండింది. ఆగస్టు చివరి వారంలోనే గేట్లను ఎత్తిన అధికారులు దిగువకు నీటి విడుదల చేపట్టారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండగా ఇప్పటికీ ఎగువ నుంచి వచ్చే వరదను దిగువకు వదలకుండానే ఆయకట్టుకు మళ్లిస్తున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం నీళ్లు ఉంచుతూనే వరద నీటిని ఆయకట్టుకు మళ్లిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు గేట్లన్నీ మూసివేశారు. ఎగువ నుంచి ప్రాజెక్టుకు ప్రస్తుతం 27వేల 315 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను ప్రస్తుతం అంతే మొత్తంలో నీటిని నిలువ ఉంచారు. పూర్తి కెపాసిటీ 80.5 టీఎంసీలను కొనసాగిస్తూ పైనుంచి వస్తున్న వరదను కాకతీయ ద్వారా 6,800 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నాలుగు యూనిట్ల ద్వారా 36 మెగా వాట్ల జల విద్యుత్‌ను ప్రతీరోజు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ నీటిని జల విద్యుత్‌కు వాడుతూనే కాకతీయ కాలువకు మళ్లిస్తున్నారు. ఇవేకాకుండా వరద కాలువకు 19వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండికి విడుదల చేస్తున్నారు. సరస్వతి కాలువకు 400 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 200, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరదకు అనుగుణంగా నీటిని మళ్లిస్తున్నారు.

ఇప్పటి వరకు 180టీఎంసీల వరద..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఈ సంవత్సరం ఇప్పటి వరకు 180టీఎంసీల వరద వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకు 108 టీఎంసీల నీటిని దిగువ గోదావరికి విడుదల చేశారు. జూన్, జూలై నెలలో వర్షాలు లేక ప్రాజెక్టులోకి సగంలోపే నీళ్లు రాగా ఆగస్టు నెలలో భారీ వర్షాలతో నిండటంతో పాటు గేట్లను కూడా ఎత్తి దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు కెపాసిటీ కంటే ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేశారు. దిగువన 25టీఎంసీల ఎల్లంపల్లి ప్రాజెక్టు మినహా వేరే భారీ ప్రాజెక్టులు లేకపోవడం వల్ల నీళ్లన్నీ సముద్రానికే వెళ్లాయి. ప్రతీసంవత్సరం ఈ ప్రాజెక్టుకు ఆగస్టులోనే భారీగా వరద వస్తుంది. సెప్టెంబర్ చివరి వరకు కొనసాగుతోంది. ఈ సమయంలోనే ప్రతీసంవత్సరం ప్రాజెక్టు నిండటంతో పాటు గేట్లను ఎత్తుతున్నారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబరు 28 వరకు తెరిచే ఉండటం వల్ల ఎగువన మహారాష్ట్రలో పడే వర్షాలకు అప్పటి వరకు వరద వచ్చి చేరుతోంది. ప్రతీసంవత్సరం అక్టోబరు వరకు వరద వస్తుండగా ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టాన్ని కొనసాగిస్తూ యాసంగి పంటలకు నీటిని విడుదల చేస్తున్నారు. సెప్టెంబరులో పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో నీటిని ఉంచుతూనే ఎగువ నుంచి వచ్చే వరదను ఆయకట్టుకు ఇస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఈ ప్రాజెక్టు నుంచే మిడ్‌మానేరుకు, లోయర్ మానేరు డ్యామ్‌కు నీటిని తరలిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఇప్పటి వరకు 15 టీఎంసీల వరకు మిడ్‌మానేరుకు నీటిని తరలించారు. ఈ సంవత్సరం కూడా ప్రాజెక్టుకు భారీ వరద వచ్చి చేరడం వల్ల ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతుల్లో కూడా భరోసా పెరిగింది. ఆగస్టు చివరి వారం వరకు ఆందోళనలో ఉన్న రైతులకు ఒకేసారి భారీ వర్షాలు పడటం వల్ల రెండు పంటలకు నీళ్లు అందే పరిస్థితి ఏర్పడింది.

ప్రాజెక్టు పరిధిలో 9.4 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు..

ఎస్సారెస్పీ పరిధిలో ప్రస్తుతం 9.4లక్షల ఎకరాల ఆయకట్టు సాగు అయ్యింది. మొత్తం ప్రాజెక్టు పరిధిలో ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఎల్‌ఎండి ఎగువన ఉన్న ఆయకట్టుకు కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను చేస్తున్నారు. సరస్వతి, లక్ష్మి కాలువల ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. ఇవేకాకుండా గుత్ప అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 9.4లక్షల ఎకరాల ఆయకట్టు సాగు అయినట్లు అధికారులు అంచనా వేశారు. ఎక్కువగా కాకతీయ కాలువ పరిధిలోనే ఈ సాగు బాగా పెరిగింది. ప్రాజెక్టు పరిధిలో మొత్తం రైతులు వరిసాగును చేపట్టారు. వర్షాలు ఆలస్యంగా ఆరంభమైన జూలై, ఆగస్టు నెలలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడటంతో రైతులు వరి సాగువైపు మొగ్గు చూపారు. ప్రాజెక్టు నిండటం వల్ల వానాకాలం పంటతో పాటు యాసంగి పంటకు కూడా ఢోకా లేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వస్తున్న నీటిని గమనిస్తూ పంటలకు విడుదల చేస్తున్నామని ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణిలు, ఏఈ వంశీలు తెలిపారు. వరద ఎక్కువగా ఉన్న సమయంలో గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు.


పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

ప్రమాణస్వీకారానికి తరలిన జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 15: టీ పీసీసీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షితో పాటు ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్రానికి చెందిన ఇతర మంత్రులు, ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన ముఖ్యనేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివెళ్లారు. జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ ఎన్‌ఎస్‌యూఐ నుంచి సామాన్య కార్యకర్తగా ఎదిగి పీసీసీ అధ్యక్షుడిగా నియామకం కావడంపై జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రత్యేక వాహనాల్లో నేతలు హైదరాబాద్‌కు తరలివెళ్లి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, నాయకులు గడుగు గంగాధర్, కేశవేణు, నరాల రత్నాకర్, శేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డి, దయాకర్ గౌడ్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.


మహేష్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోచారం శ్రీనివాస్

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం నూతన టీ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను పుష్పగుచ్ఛం అందించి అభినందించిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితోపాటు బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి భారీ బందోబస్తు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

- బందోబస్తుకు 2వేల మంది పోలీసుల వినియోగం
- మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

నిజామాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా పోలీసులతో పాటు శిక్షణ పొందిన కానిస్టేబుళ్లను కూడా బందోబస్తుకు వినియోగిస్తున్నామని అన్నారు. మొత్తంగా 2వేల మంది పోలీసులకు పైగా బందోబస్తు కోసం వినియోగిస్తున్నామన్నారు. జిల్లాలో కొన్ని సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయని వాటన్నింటిని సమీక్షించి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో నవీపేట మండలం యంచ, నందిపేట మండలం ఉమ్మెడ వద్ద నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. భారీ విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం కొనసాగిస్తారన్నారు. యంచ వద్ద కూడా చిన్న విగ్రహాలకు అవకాశం కల్పించామన్నారు. నగరంలోని వినాయకుల బావి వద్ద కూడా నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. సీసీ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. నిమజ్జనం రోజు డీజేలకు అనుమతి లేదని తెలిపారు. గత సంఘటనలు దృష్టిలో పెట్టుకొని రౌడీ షీటర్లను కూడా ముందస్తుగానే హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు.

ఏర్పాట్లపై అధికారులతో ఐజీ సమీక్ష..

గణేష్ నిమజ్జనం సందర్భంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ముందస్తుగానే జిల్లాలోని అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉన్నందున ఆయన అన్ని ప్రాంతాలపై పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. సీపీతో పాటు అదనపు సీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇతర అధికారులతో చర్చించారు. అప్రమత్తంగా ఉండి నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో సీపీ కల్మేశ్వర్ సింగెనవార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కోటేశ్వర్‌రావు, అడిషనల్ డీసీపీ ఏఆర్ శంకర్ నాయక్, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, బస్వారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, నాగయ్య, నారాయణ, రవీందర్‌రెడ్డి, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ముందస్తుగా.. ధాన్యం తీసుకోబోం!

- జిల్లాలో ధాన్యం ముందస్తుగా తీసుకోబోమంటున్న మిల్లర్లు
- ఇప్పటికే అధికారులకు వినతిపత్రం అందించిన అసోసియేషన్ నేతలు
- బియ్యం ముందస్తుగా ఇచ్చి ధాన్యం తీసుకుంటామని వినతి
- మిల్లర్ల వినతిని ప్రభుత్వానికి పంపించిన సంబంధిత అధికారులు

నిజామాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలంలో వచ్చే ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నం కాగా రైస్ మిల్లుల్లో మాత్రం ఈ దఫా తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. సన్న రకం ఎక్కువగా సాగు కావడం వల్ల కస్టం మిల్లింగ్ నిబంధనల ప్రకారం బియ్యం ఇవ్వడం సాధ్యం కాదని వారు భావిస్తున్నారు. ఇప్పటికే వానాకాలంలో ధాన్యం కొనుగోలు చేయగానే మిల్లులకు పంపించవద్దని అధికారులకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. పాత పద్ధతిలో బియ్యం ఇచ్చిన తర్వాతనే ధాన్యంను మిల్లులకు కేటాయించాలని వారు కోరుతున్నారు. మిల్లర్ల వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపించిన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. జిల్లా రైస్ మిల్లర్లు వచ్చే ... అసోసియేషన్ ద్వారా ఆ శాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధమవుతున్నారు. కస్టం మిల్లింగ్ విషయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న మిల్లర్లు ఈ దఫా ఎలాగైనా ధాన్యం తీసుకునేందుకు వెనకడుగు వేయడంతో పాటు పాత టార్గెట్లన్నీ పూర్తిచేసిన తర్వాతే తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం ముందస్తుగానే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వేసిన పంటలకు అనుగుణంగా ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేశారు. వరి సాగు విస్తీర్ణం బట్టి దిగుబడి వచ్చే ధాన్యానికి అనుగుణంగా కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దిగుబడిని బట్టి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వెంటనే మిల్లర్లకు కేటాయించే విధంగా ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ఇదే ప్రకారం కొనుగోళ్లను చేస్తున్నారు. ప్రతీ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తున్నారు. నిబంధనల ప్రకారం కస్టం మిల్లింగ్ చేసి ధాన్యాన్ని మిల్లర్లు అప్పచెబుతున్నారు. ఎఫ్‌సీఐకి ధాన్యాన్ని పంపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వింటాళ్ల ధాన్యానికి 67 కిలోల బియ్యాన్ని అందించాలి. ప్రతీ సీజన్‌లోనూ ఇదే విధంగా కేటాయింపులు చేసి నిర్ణీత సమయంలో బియ్యాన్ని మిల్లర్లు కస్టం మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి పెట్టే విధంగా చూస్తున్నారు. మూడేళ్లుగా ధాన్యం కేటాయింపులు చేసిన కొన్ని మిల్లుల నుంచి కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని అందించలేదు. జిల్లా అధికారులు కేటాయించిన ధాన్యం కూడా వారి వద్ద నిలువ లేదు. కొత్తగా ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధానమైన మిల్లులలో తనిఖీ చేయగా ఈ విషయం బయటపడింది. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ల ద్వారా ఈ తనిఖీలను చేపట్టారు. జిల్లాలో కూడా సుమారు 30 మిల్లుల్లో ఈ ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. 11 మిల్లులపై కేసులను నమోదు చేశారు. మిగతా మిల్లులకు నోటీసులు ఇచ్చారు. సుమారు 250కోట్ల వరకు ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించడంతో పాటు వారి వద్ద నుంచి బియ్యాన్ని వసూలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మిల్లర్లు బియ్యం ఇవ్వగా, మరికొన్ని మిల్లర్లు ధాన్యానికి సంబంధించిన డబ్బులను చెల్లిస్తున్నారు.

జిల్లాలో 330 రైస్‌మిల్లులు

జిల్లాలో మొత్తం 330 వరకు రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిలో పెద్ద మిల్లులతో పాటు చిన్న మిల్లులు ఉన్నాయి. రెండు టన్నుల నుంచి మొదలుకొని పది టన్నుల వరకు కెపాసిటీ ఉన్న మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల కెపాసిటీ ఆధారంగా ప్రతీ సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ అధికారులు మిల్లులకు ధాన్యాన్ని కేటాయింపులు చేస్తున్నారు. ధాన్యం కస్టం మిల్లింగ్ చేసేందుకు కమిషన్ ఇస్తున్నారు. ప్రతీ సంవత్సరం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తున్న కస్టం మిల్లింగ్ విషయంలో మిల్లర్లకు సమస్యలు ఎదురవుతున్నాయని వారు విన్నవిస్తున్నారు. ఎండిన ధాన్యాన్ని ఇవ్వకపోవడం, తడిసిన ధాన్యం, పచ్చి ధాన్యం పంపించడం వల్ల నిబంధనల ప్రకారం కస్టం మిల్లింగ్ కింద బియ్యం రావడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పచ్చి ధాన్యం మురిగి పోవడం, తడిసిన ధాన్యం రంగు మారుతుండటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ దఫా ధాన్యం కేటాయింపులు ముందుగానే మిల్లులకు వేవద్దని కోరుతున్నారు. ఇప్పటికే పౌరసరఫరాల జిల్లా అధికారులతో పాటు అదనపు కలెక్టర్, కలెక్టర్‌ను కలిసి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రాలను అందించారు. ఈ యేడాది సన్నరకాలు ఎక్కువగా సాగు చేసినందున నిబంధనల ప్రకారం క్వింటాలుకు 67 కిలోలు రావని తక్కువగా వస్తుందని వారు వివరించారు. గతం కంటే భిన్నంగా పాత పద్ధతిలోనే ముందుగా తామే బియ్యం ఇచ్చి దానికి సరిపడా ధాన్యాన్ని తీసుకుంటామని వారు అధికారులకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ధాన్యం కేటాయింపులు చేసి తర్వాత కస్టం మిల్లింగ్ చేసిన తర్వాత నిబంధనల ప్రకారం బియ్యం రాకపోవడం వల్ల మిల్లర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి తీసుకు వచ్చి మిల్లింగ్ చేసి అందిస్తున్నామని వారు వివరిస్తున్నారు.

చదువుతోపాటు క్రీడలనూ ప్రోత్సహించాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్
- ముగిసిన దక్షిణ భారత సైక్లింగ్ పోటీలు
- ఓవరాల్ ఛాంపియన్‌గా కర్నాటక

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15: తల్లిదండ్రులు చదువుతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ అన్నారు. నగరంలోని మహిళా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా సైక్లింగ్ పోటీల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటారని, క్రీడాకారులు లక్ష్యంతో ముందుకు వెళితే విజయం సాధించవచ్చని అన్నారు. తాను కూడా రెగ్యులర్‌గా సైక్లింగ్ చేస్తానని అన్నారు. అనంతరం ఆదిలాబాద్ ఆర్‌డీవో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, రాష్ట్ర సైక్లింగ్ సంఘం కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్‌రావు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుభేదార్, సూర్యప్రకాష్, నర్సింగ్‌రావు, అబ్జర్వర్ మ్యాక్స్‌వెల్ రాష్ట్ర కోశాధికారి వెంకటనర్సయ్య, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.


మెడల్స్, ప్రశంసా పత్రాలతో క్రీడాకారులు

కర్నాటక క్రీడాకారులదే హవా..

మొదటి రోజు, రెండవ రోజు కర్నాటక క్రీడాకారులదే హవా కొనసాగింది. మొత్తం పతకాలన్నీ కర్నాటక క్రీడాకారులే తమ సొంతం చేసుకున్నారు. సబ్ జూనియర్ గర్ల్స్ 20 కిలోమీటర్లు, ఎమెన్ జూనియర్ 30 కిలోమీటర్లు, ఉమెన్ ఎలైట్ విభాగంలో మొత్తం పతకాలను తమ ఖాతాల్లో వేసుకున్నారు.

రెండో రోజు విజేతలు వీరే..

సబ్ జూనియర్ బాలికల 20 కిలోమీటర్ల విభాగంలో... దీపిక (గోల్డ్ మెడల్, కర్నాటక), గాయత్రీ (సిల్వర్ మెడల్, కర్నాటక), కోకిల చావన్ (బ్రౌంజ్ మెడల్, కర్నాటక). మహిళా జూనియర్ 30కిలో మీటర్ల విభాగంలో... పాయల్ ఛావన్ (గోల్డ్ మెడల్, కర్నాటక), పూజా (సిల్వర్ మెడల్, కర్నాటక), కీర్తి నాయక (బ్రౌంజ్ మెడల్, కర్నాటక). ఉమెన్ ఎలైట్ 40 కిలోల విభాగంలో... నంద చించకండి (గోల్డ్ మెడల్, కర్నాటక), దానమ్మ గౌరవ్ (సిల్వర్ మెడల్, కర్నాటక), గంగా (బ్రౌంజ్ మెడల్, కర్నాటక).

పీఆర్‌టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 15: పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా రెండో సారి పొద్దుటూరి మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ఆర్మూర్‌కు చెందిన ఎస్.వి. కృష్ణారెడ్డిలు నామినేషన్‌లు దాఖలు చేయగా ప్రధాన కార్యదర్శి కోసం ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, జి.కిషన్, ఎం బెల్లి శంకర్‌లు నామినేషన్‌లు దాఖలు చేయగా మధ్యాహ్నం ఓటింగ్ నిర్వహించారు. ఉదయం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావులు హాజరయ్యారు. 195 ఓట్లకు గాను 188 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి ఎస్.వి. కృష్ణారెడ్డి చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేయగా గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న మోహన్‌రెడ్డి వైపే మెజార్టీ ఉపాధ్యాయులు మొగ్గు చూపడంతో ఆయన వరుసగా రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడేళ్లుగా అధ్యక్షుడిగా ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయుల అనేక సమస్యలను పరిష్కరించడంలో కృషి చేయడంతో ఉపాధ్యాయులంతా ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులలో ఆయన ఉపాధ్యాయుల పక్షాన నిలబడ్డాడు. 317 జీవో వల్ల నష్టపోయిన చాలా మంది ఉపాధ్యాయులకు, పదోన్నతులలో తప్పులు దొర్లిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేశారు. అధ్యక్ష పదవికి పోటీ నామమాత్రంగానే అయినప్పటికీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రం తీవ్ర పోటీ నెలకొంది. ప్రధాన కార్యదర్శి పదవి కోసం ముగ్గురు పోటీ పడగా చివరకు నందిపేటకు చెందిన గంగోనే కిషన్ ప్రధాన కార్యదర్శి గెలుపొందారు. కాగా, ఆదివారం రాత్రి 10 గంటల వరకు కౌంటింగ్ కొనసాగింది.


మోహన్‌రెడ్డి

నేడు మిలాద్ ఉన్ నబీ

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15: ముస్లింలు పరమ పవిత్రంగా భావించే మహ్మద్ ప్రవక్త జన్మదినం అయిన మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని సోమవారం జరుపుకోనున్నారు. అల్ల యొక్క చివరి దూతగా మహ్మద్ ప్రవక్తను భావిస్తారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వీధులలో భక్తి గీతాలు పాడుకుంటూ ఉత్సవాలను నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుంది. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మూడవ నెల అయిన రబీ అల్ అవ్వల్‌లో ఈ మిలాద్ ఉన్ నబీ పర్వదినం వస్తుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రంలోని కచ్చ మజీద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.



కాలూర్‌లో రూ.లక్షా46వేలకు లడ్డూ వేలం

మోపాల్, సెప్టెంబరు 15: నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్ గ్రామంలో ఉన్న శ్రీభవాని పుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలం లక్షా 46వేల రూపాయలకు వేలంలో సుక్కబొట్ల అన్వేష్ దక్కించుకున్నాడు. గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున లడ్డూ వేలం జరగడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అలాగే సారంగపూర్ గ్రామంలో సార్వజన గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం 11వేల 111 రూపాయలకు గణేష్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. రూరల్ మండలంలోని కాలూర్, ఖానాపూర్, తిర్మన్‌పల్లి, గుండారం, జలాల్‌పూర్, లక్మాపూర్, మల్కాపూర్, ముత్తకుంట, ధర్మారం, మల్లారం, ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, కేశాపూర్, తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.

ప్రమాణస్వీకార మహోత్సవానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఇందల్వాయి, సెప్టెంబరు 15: పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం ప్రమాణస్వీకారం చేస్తుండటంతో ఈ కార్యక్రమానికి ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నారని ఆయన కరాటే మాస్టర్ నుండి పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికవడం అభినందనీయమని అన్నారు. ఇందల్వాయి మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తరలివెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాదాస్, గంగారెడ్డి, మల్లయ్య, గంగాధర్, రాజన్న, తదితరులు ఉన్నారు.

మాక్లూర్: పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆదివారం మాక్లూర్ మండల కాంగ్రెస్ నాయకులు బస్సులు,కార్లలో బయలుదేరి వెళ్లారు. ఇట్టి ప్రమాణ స్వీకారోత్సవానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవిప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, విండో ఛైర్మన్ బూరోల్ల అశోక్, ఎస్టీసెల్ నాయకుడు పీర్‌సింగ్, నా య కులు జైసింగ్, రాజు, తదితరులు తరలివెళ్లారు.

డిచ్‌పల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ ఆదివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకారణ కార్యక్ర మానికి డిచ్‌పల్లి మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.ఈసందర్భంగా మ హేశ్ కుమార్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు పొలసాని శ్రీనివాస్ నూతన అధ్యక్షుడు మహేశ్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలి పిన వారిలో కాంగ్రెస్ నాయకులు సాయిప్రసాద్, బాబా, రాజేశ్వర్, వా సుబాబు, రాంచందర్‌గౌడ్, పెద్దొళ్ల శ్రీను, పులివెంకటేశ్వరరావు, బల రాం, విటల్ నాయక్, తారచంద్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, ఇబ్రహీం, నర్సారెడ్డి, దేవరాజు, గ్రామాల కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

భీమ్‌గల్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడి బోదిరేస్వామి ఆధ్వర్యంలో ఆదివారం భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, పర్స అనంతరావు, ఏశాల కృష్ణ, అరిగెల జనార్ధన్, జెమ్స్, నల్లూరి శ్రీనివాస్; కార్యకర్తలు ఉన్నారు.

'ఎనిమిది ఫీట్ల పైన విగ్రహాలు ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాలి'

ఖిల్లా, సెప్టెంబరు 15: జిల్లాలో 8 ఫీట్ల కన్నా ఎక్కువ ఎత్తున గణేష్ విగ్రహాలను ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్దనే నిమజ్జనం చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ విగ్రహాలు 8 ఫీట్ల కన్న ఎత్తు ఉంటే జాన్కంపేట, నవీపేట వద్ద రైల్వే ఎలక్ట్రికల్ లైన్ ఉన్నందువల్ల రైల్వే వారు లెవల్‌బీమ్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ తీగల కింద 8 ఫీట్ల విగ్రహాలు బాసర వెళ్లేందుకు కష్టమైనందున నందిపేట మండలం ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాలని తెలిపారు.

విద్యుత్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు15: రానున్న గణేష్ నిమజ్జన దృష్ట్యా భారీ వి నాయక విగ్రహాలకు విద్యుత్ వినియోగదారులకు ఏలాంటి అంత రాయం కలుగకుండా అధికారులు విద్యుత్ స్తంభాలకు మరమ్మత్తులు చేస్తున్నారు. పలు చోట్ల చిన్నగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి పెద్దవాటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్, ఏఈ అశ్రితరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లైన్‌మెన్ ఎల్లయ్య, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కోటగిరి,సెప్టెంబరు 15: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాలను ఆదివారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. కళాశాలలో డార్మెటరీ, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్ ఉన్నారు.

శోభాయాత్రలో డీజే నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

ధర్పల్లి, సెప్టెంబరు 15: వినాయక శోభాయాత్ర సందర్భంగా డీజేలతో ఊరేగింపుగా తీసుకెళ్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని రామడుగు గ్రామంలో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఆయన చెప్పారు. శాంతియుతంగా గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. మండలంలో 11 రోజుల వరకు వినాయకులను ప్రతిష్ఠించిన అనంతరం నిమజ్జనానికి తరలిస్తారు. మంగళవారానికి 11 రోజులు కావడంతో పెద్దసంఖ్యలో వినాయకులను నిమజ్జనానికి తరలించే అవకాశం ఉంది. దీంతో పోలీసులు బందోబస్తుపై దృష్టి సారించారు. అన్ని గ్రామాల్లో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా వినాయక మండపాలకు సూచనలు అందజేస్తున్నారు. ప్రశాంతంగా నిమజ్జనం కోసం మండల ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ధర్పల్లి, సెప్టెంబరు 15: మండలంలోని రామడుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం రామడుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ధర్పల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.

బీఎస్‌ఐ కార్యక్రమాలపై అవగాహన

ఖిల్లా, సెప్టెంబరు 15: భారతీయ ప్రమాణాల సంస్థ కార్యక్రమాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ అన్నారు. నిజామాబాద్‌లోని ఇందూరు కన్జ్యూమర్ వెల్ఫేర్ సొసైటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వినియోగదారులకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. వినియోగదారులకు సంబంధించి 2019 రక్షణ చట్టం ప్రకారం హక్కులను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీఎస్‌ఐ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బీఎస్‌ఐ రూపొందించిన యాప్‌ను ప్రతీ వినియోగదారుడు తెలుసుకోవాలన్నారు.

తడపాకల్‌లో రక్తదాన శిబిరం

ఏర్గట్ల,సెప్టెంబరు 15: తడపాకల్ గ్రామంలో ఆదివారం స్పందన ఫౌండేషన్ ఆర్మూర్ వారి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు ఇల్లెందుల నలీన్ మాట్లాడుతూ స్పందన ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ప్రాణాధార సొసైటీ ప్రతాప్, సుమన్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద భక్తుల సందడి



నగరంలో అన్నదానం చేస్తున్న దృశ్యం



బోధన్‌లో గణేష్ మండలి వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రుద్రూరులో ..

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15: విఘ్నేశ్వర మాకు విఘ్నాలను తొలగించండి అని వేడుకుంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణనాథునికి ప్రీతికరమైన ఆకు పూజలు నిర్వహించి అన్నప్రసాదం అందించారు. ఆదివారం సెలవు దినం కావడంతో తొమ్మిదవ రోజున గణపతి మండపాలలో గణపతి హోమం నిర్వహించి అన్నదానాలు నిర్వహించారు. నగరంలోని సాయినగర్‌లో గణపతి హోమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందించారు. అదేవిధంగా పెద్దబజార్‌లోని మారుతి గణేష్ మండలి ఆధ్వర్యంలో ఎల్లమ్మగుట్ట శివపుత్ర గణేష్ మండలి, కెఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్‌లో, శ్రీనగర్ కాలనీ, ఆరెకటిక ఆధ్వర్యంలో తదితర ప్రాంతాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోస్రా: మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో మహాయజ్ఞ కార్యక్రమం చేపట్టారు. పవన్ యువ శక్తి గణేష్ మండలి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో 8మంది దంపతులు, యూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్, చే నెంబర్ తండా, దుబ్బా గ్రామంలో పలు గణేష్ మండపాల వద్ద హోమాలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీనగర్ కాలనీలో ఆదివారం శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్, ఈశ్వర్, మహిపాల్, రమేష్, తదితరులున్నారు.

ఎడపల్లి: మండలంలో ఆదివారం గణనాథుడి శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. మండల కేంద్రంలోని నయాబాది కాలనీతో పాటు వడ్డాపల్లి, జానకంపేట, మంగల్‌పాడ్, ఏఆర్పీ క్యాంపు, పోచారం గ్రామాలలోని గణేష్ మండపాల నుండి గణనాథుడి శోభాయాత్ర కన్నుల పండుగగా కొనసాగింది. శోభాయాత్రలో మహిళలు, యువకుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గణనాథుడిని స్థానిక చెరువుల లో నిమజ్జనం చేశారు. శోభయాత్రలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వర్ని: వినాయకుడి శోభాయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల్లో వినూత్న తరహాలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జలాల్‌పూర్ గ్రామంలో తొమ్మిది ఫీట్ల గరికె దండాను ప్రత్యేకంగా అలంకరించి సమర్పించారు.

రుద్రూరు: మండల కేంద్రంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో వినాయకునికి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని శ్రీ సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సత్యనారాయణ వ్రతం, శ్రీ లక్ష్మీ గణపతి హోమం చేశారు. ఈ సందర్భంగా మండలి ఏర్పాటై 74 ఏళ్లు అయిన సందర్భంగా వినాయకునికి 74 రకాల నైవేద్యాలను స్వామి వారికి సమర్పించి ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ హోమం లో పలువురు జంటలు కూర్చున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చిదుర వీరేశం, గెంటెల సాయిలు, పూజారి రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

● నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో

రుదూరు మండల కేంద్రంలోని అంగడి బజార్ నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయకునికి 108 వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వేల్పూర్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో ఆదివారం గణేష్ మండపం వద్ద అన్న దానం నిర్వహించారు. అంతకు ముందు మండపం వద్ద గణపతికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండపాల నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

● వేల్పూర్ వీడీసీ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేల్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల డెకరేషన్ ఉత్తమ డెకరేషన్ చేసిన పలు గణేష్ మండపాలను స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించి ఎంపిక చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలో అయోధ్యలో రామాలయంలో నిర్మించిన బాలరామాయణం దాని ప్రకారం డెకరేషన్ చేసిన మండపాన్ని ప్రథమ బహుమతిగా ఎంపిక చేసి మిగతా మండపాలకు ద్వితీయ, తృతీయ మండపాలను ఎంపిక చేసి గ్రా మాభివృద్ధి కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: యువత భక్తి భావంతో పాటు గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సాలూర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూమయ్య అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిభావంతో విఘ్నేశ్వరుడికి పూజలు జరుపుకుని ఆయన ఆశీస్సులు పొందాలన్నారు. అన్నదాన కార్యక్రమంలో సంగెపు దత్తు, సున్నపు రాజు, శివగణేష్ మండలి సభ్యులు తదితరులున్నారు.

నిజామాబాద్ కల్చరల్: నగర శివారులోని ముబారక్‌నగర్ ప్రాంతంలో శుభక్తి గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వరుసగా 18వ సంవత్సరం వినాయకుడిని ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గణేష్ మండలి అధ్యక్షుడు మోగ్లీ, ఉపాధ్యక్షుడు పవన్‌లు తెలిపారు. ప్రతీరోజు భజన కార్యక్రమాలతో పాటు హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు.

ధర్పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనం కోసం వినాయకులను శోభాయాత్రగా తరలిస్తున్నారు. ఆదివారం 9 రోజులు కావడంతో కొన్ని మండపాల వారు వినాయకులను భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో శోభాయాత్రను ప్రధాన వీధుల్లో నిర్వహించి గ్రామ శివారులోగల చెరువుల్లో నిమజ్జనానికి తరలిస్తున్నారు. మండల కేంద్రంలో శోభాయాత్రకు సంబంధించి గ్రామాభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గుంతలమయంగా ఉన్న రోడ్లను మొరంతో మరమ్మతులు చేశారు. నిమజ్జనం కోసం ప్రత్యేక క్రేన్‌లు ఏర్పాటు చేశారు.



అంక్సాపూర్‌లో గణేష్ మండపం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



పూజలందుకుంటున్న గణనాథుడు



నవీపేటలోని తడగామలో గణేష్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎస్సై

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గణేష్ నిమజ్జనం నిర్వహించారు. మండల కేంద్రంలోని తడగామతో పాటు నాళేశ్వర్, జన్నేపల్లి, కోస్లీ, కమలాపూర్, అభంగపట్నం, అబ్బాపూర్(ఎం), నందిగామ తదితర గ్రామాలలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక రథాలను అందంగా అలంకరించి గ్రామాలలో శోభాయాత్ర నిర్వహించారు. వినాయక నిమజ్జనం చేయగా భారీ సైజు వినాయక విగ్రహాలను యంచ గోదావరిలో నిమజ్జనం చేశారు.

● యంచ గోదావరి వద్ద నిమజ్జన ఏర్పాట్లు

మండలంలోని యంచగోదావరి వద్ద గణేష్ నిమజ్జనానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫ్లగ్ లైట్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనానికి భారీ క్రేన్‌లను సైతం అందుబాటులో ఉంచారు. ముందు జాగ్రత్త చర్యగా గజ ఈతగాళ్లను సిద్దంగా ఉంచారు.

రూ.60 వేలు సాయమందించిన పూర్వవిద్యార్థులు

వర్ని,సెప్టెంబర్ 15: అయిన వాళ్లను కోల్పోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న తోటి విద్యార్థులకు సహాయంగా నిలిచారు సాటి విద్యార్థులు. పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆపదలో ఉండే సాటి విద్యార్థులకు ఆపన్న హస్తం అందించేందుకు శ్రీకారం చుట్టారు. తగిలేపల్లి గ్రామంలో బి.సిద్ధి రాములు, గైని రాములు కుటుంబాలతో పాటు సత్యనారాయణ పురంకు చెందిన వేగుల వినోద్ కుమార్ కుటుంబాలకు రూ.20వేల చొప్పున ఆర్థిక సహాయంను అందజేశారు. దీంతో తోటి విద్యార్థుల సహాయంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బానోత్ రమేష్, మొబైల్ శ్రీను, వడ్ల భాస్కర్, దడ్ల రాజు, గైని గోపి, కేతావత్ భీమా, శ్రీను, సాధక్, సోన్ కాంబ్లె, గుజ్జ రవీందర్, గుజ్జ సాయిలు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టొద్దు'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 15: ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్యన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చిచ్చుపెట్టే విధంగా మాట్లాడడం సరికాదని నిజామాబాద్ పార్లమెంట్ తెలుగు యువత బోధన్ ఇన్‌చార్జి ఎత్తొండ రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన బోధన్‌లో మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టవద్దన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరు కలిసిమెలిసి ఉంటారని ఇది ఆయన గుర్తు ఉంచుకోవాలన్నారు. మరోమారు రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టేప్రయత్నం చేయవద్దన్నారు.

కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 15:కామారెడ్డి పట్టణంలో జరిగే వినాయక నవరాత్రి నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి బుధవారం ఉదయం 9 గంటలవరకు పట్టణంలోనిస్టేషన్‌రోడ్డు, సిరిసిల్లరోడ్డు, సుభాష్‌రోడ్డు, పెద్దబజార్, పాంచ్‌రాస్తా, వీక్లిమార్కెట్, జేపీఎన్‌రోడ్డు,తిలక్‌రోడ్డులలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి స్టేషన్‌రోడ్డు వైపుకు భారీ వాహనాలు, చిన్నవాహనాలు అవసరాన్ని బట్టి మాత్రమే వారి నివాసాలకు వెళ్లె విధంగా అనుమతించబడుతాయని తెలిపారు. సిరిసిల్లరోడ్డునుండి మాచారెడ్డివైపు వెళ్లెవాహనాలను,సిరిసిల్లరోడ్డుబ్రిడ్జి వద్ద ఎన్‌హెచ్ 44 వైపుకు మళ్లించబడునని తెలిపారు.రామారెడ్డి, గర్గుల్ నుండి వచ్చేవాహనాలను గుమస్తా కాలనీ వద్ద జిల్లా పోలీసుకార్యాలయం వైపు, అశోక్‌నగర్ రైల్వేగేటు వద్ద నుండి పట్టణంలోపలికి వచ్చే వాహనాలను కొత్తబస్టాండ్ వైపుకు మళ్లించబడునని తెలిపారు. ఆర్టీసీ బస్సులను కొత్తబస్టాండ్ వద్ద మాత్రమే అనుమతించబడునని ప్రయాణికులు వారి ప్రయాణాలను కొత్తబస్టాండ్ నుంచి మాత్రమే కొనసాగించాలని తెలిపారు.

కన్నుల పండుగగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 15: మండలంలోని ధర్మారం గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం శ్రావణ నక్షత్ర సందర్భంగా స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది.ఈ సందర్భంగా అర్చకుడు రాహుల్ త్రిపాఠి, కల్యాణ కార్యక్రమం నిర్వహించారు.

మండపాల్లో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని పలు గణేష్ మండపాల వద్ద అన్నదానం, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథునికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అలాగే మండపంలో గణేష్‌కు ప్రత్యేక పూజలతో పాటు మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. విశ్వసేన, రుద్రసైని, యోగేశ్వర కాలనీలోని దాస ఆంజనేయ శివఅన్నపూర్ణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదే

● సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

బోధన్‌రూరల్,సెప్టెంబరు 15: తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదేనని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాయుధ పోరాట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారన్నారు. ఆయన జీవితంతం భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. పుట్టింది బ్రాహ్మణ కులమైన దేశంలోని నిరుపేదల ప్రజల కోసం, కార్మిక వర్గ సంక్షేమం కోసం సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసి తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటం చారిత్రాత్మకం అన్నారు. పోరాడితో పోయేది బానిస సంకెళ్లేనని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే తప్ప ఎవరు కారని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, గంగాధరప్ప, జంగం గంగాధర్, నన్నేసాబ్, నాగేశ్వర్, సిర్ప లింగం, దాసు, గోపి, పత్రి ఎల్లయ్య, షేక్.నజీర్, పోశెట్టి, ప్రసాద్, సత్యనారాయణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాట ఫలితమే హైదరాబాద్ సంస్థానం విలీనం

కోటగిరి,సెప్టెంబర్ 15: కమ్యూనిస్టుల త్యాగాల ఫలితమే నాటి హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 17వ తేది వరకు అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ 76వ వార్షికోత్సవ సభలను నిర్వహిస్తున్నామన్నారు. నాటి నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటంలో ఎందరో అమరులయ్యారన్నారు. వారి త్యాగాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 17వ తేదిన భారత దేశంలో తెలంగాణ ప్రాంతం విలీనాన్ని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, గంగాధర్, సునీల్, రాములు, శరత్, హన్మాండ్లు, సంజీవ్, నాగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'బహుజన శ్రామిక జాతుల గౌరవదినంగా జరుపుకోవాలి'

ఖిల్లా, సెప్టెంబరు 15: సెప్టెంబర్ 17న బహుజన శ్రామిక జాతుల స్వయం గౌరవ రాజ్యాధికార సాధన దినోత్సవంగా జరుపుకోవాలని బీఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ కోరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోరాటంలో బహుజన శ్రామిక జాతుల వారు పాల్గొన్నారని అన్నారు. వారందరిని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బని లత, సాయి కాంబ్లె, గీతాంజలి, దండు జ్యోతి, టి.రాజు, ఆశాబాయి, చంద్రగౌడ్, గంగాధర్ వాగ్మారే తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో గణేష్ నిమజ్జనం

● అధికారుల తీరుపై భక్తుల అసహనం



చీకట్లో గణేష్ నిమజ్జనం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు15: పట్టణంలోని గూండ్ల చెరువు ప్రాంతంలో భక్తులు చీకట్లో గణేష్ నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు గణనాథునికి పూజలు చేసి ఆదివారం రాత్రి నిమజ్జనం చేయగా గూండ్ల చెరువు వద్ద అధికారులు విద్యుల్ లైట్లు ఏర్పాటు చేయకపోవడం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గణేష్ మండపాల వారు ఇళ్ళ నుంచి చార్జింగ్ లైట్‌లను తీసుకువచ్చి గణేష్ నిమజ్జనం పూర్తిచేస్తున్నారు. గణేష్ నిమజ్జనం తొమ్మిది రోజులకు, పదకొండు రోజులకు చేస్తారు. పలువురు గల్లీలో ఏర్పాటు చేసుకున్న గణనాథులను తొమ్మిది రోజులకు గణేష్ నిమజ్జనం చేశారు. అధికారులు నిమజ్జన ఏర్పాట్లును ముందుగా చేయాల్సింది పోయి ప్రధాన రోడ్డు నుంచి గూండ్ల చెరువు వరకు వచ్చే రోడ్డులో విద్యుత్ స్తంబాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో పాటు నిమజ్జన ప్రదేశంలో ఒక్క లైట్ ఏర్పాటు చేయలేదు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పదోతరగతి విద్యార్థులతో 'విజయస్ఫూర్తి'

పెర్కిట్,, సెప్టెంబరు15: ఆర్మూర్ మండల ప్రైవేటు పాఠశాలల ఆధ్వ ర్యంలో ఆదివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో జీఆర్ గార్డెన్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యకరమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్‌పర్సన్, టెస్ట్ బుక్ రైటర్ చక్రవర్తుల శ్రీనివాస్, శశికళధర్, గౌస్‌పాషా ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లోని మేళకువలు, మానసికంగా, దృఢంగా ఉండాలంటే జీవన విధానం ఏలా ఉండలో అవగాహన కల్పించారు.

విద్యార్థుల తల్లులకు క్రీడా పోటీలు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు15: ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో ఆదివారం మాతృమూర్తుల సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం వారికి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృ మూర్తులను ఉల్లాసపర్చడానికి త్రోబాల్, సోలో డ్యాన్స్, బాంబ్ ఇండసిటీ, తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ కవిత దివాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యార్థుల మాతృమూర్తులకు అవగాహన పెంచడానికి, పిల్లల చదువు, క్రమశిక్షణ, వారి అభివృద్ధి, పరీక్ష విధానంపై సందేహాలను తీర్చి తగిన సూచనలను, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమ నేత మనోహర్‌రెడ్డికి ఘనంగా నివాళి



మనోహర్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మోర్తాడ్, సెప్టెంబరు15: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం పాలెం గ్రామ మాజీసర్పంచ్ పసుపుబోర్డు సాధన కోసం పోరాడిన ముత్యాల మనోహర్‌రెడ్డి అంత్యక్రియాలకు గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు, అభి మానులు తరలివెళ్లారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన అంత్యక్రి యాలు జరిగాయి. ఆర్మూర్ ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు విప్రభాకర్, దేగాం యాద గౌడ్, నోముల ముత్యంరెడ్డి, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్‌కుమార్, పొద్దుటూరి వినయ్ రెడ్డి, విత్తనా భివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిలు, బీజేపీ అగ్రనాయకులు లోక భూపతిరెడ్డి, కోటపాటి నర్సింహంనాయుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యేండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా నాయ కులు దయానంద్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు మనోహర్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. రైతుల కోసం అహోర్నిశలు పోరాడిన ఉద్యమ నాయకుడని, పసుపు బోర్డు కోసం 12ఏళ్ల పాదరక్షలు ధరించలేదని పసుపుబోర్డు ప్రకటన వచ్చిన తర్వాతనే పాదరక్షలు ధరిం చారని, ఎర్రజొన్న రైతులకు రావల్సిన రూ.11కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించాలని అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి తిరు పతి వరకు పాదయాత్ర చేసి తమ నిరసన వ్యక్తం చేశారని పలువురు కొని యాడారు. ఆర్మూర్ ప్రాంతంలో ఆయన పాల్గొనని ఉద్యమంలేదని, ఆయన పోరాట పటిమను జ్ఞాపకం చేసుకున్నారు. భారీ సంఖ్యలో రైతులు, అభిమా నులు, గ్రామస్థులు అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డికి నివాళులర్పించిన అన్వేష్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్,సెప్టెంబరు 15: పసుపు బోర్డు సాధన నాయకుడు ముత్యాల మనోహర్‌రెడ్డి మృతి రైతాంగానికి తీరనిలోటని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆ దివారం హైదరాబాద్‌లో మనోహర్‌రెడ్డి మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. పసుపు బోర్డు సాధన కోసం నిరంతరం పో రాడి పసుపు బోర్డు వచ్చేవరకు పాద రక్షలు లేకుండా పాదయాత్ర చేసిన గొప్పవ్యక్తి అని అన్నారు. ఎంతో మ ందికి స్ఫూర్తి దాయకంగా నిలిచిన ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలంటే పసు పుబోర్డు నిర్మాణం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో కా ంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం కోసం నిరసన



ముప్కాల్‌లో ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

ముప్కాల్, సెప్టెంబరు15: మండల కేంద్రంలోని పాత జాతీయరహదారి వద్ద శివాజీ విగ్రహ ఏర్పాటు విషయంలో స్థానిక మైనారిటీ చేసిన ఫిర్యాదు మేరకు శివాజీ యూత్ సభ్యులు నిరసన, రాస్తారోకో చేశారు. ముందస్తు సమ చారం తెలుసుకున్న పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి శివాజీ యూత్ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి ఏసీపీ బస్వారెడ్డి, సీఐశ్రీధర్, ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను సద్దుమనిగించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటన జరుగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంజనీర్ల సేవలు దేశానికి ఉపయోగపడాలి



బోధన్‌లో ఇంజనీర్‌ని సన్మానిస్తున్న దృశ్యం



విశ్వేశరయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్



ఆర్మూర్‌లో ..

బోధన్‌రూరల్,సెప్టెంబరు 15: ఇంజనీర్లు దేశానికి ఉపయోగపడేలా ప్రాజెక్టులు తయారు చేసి ఇవ్వాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ రవీందర్ గుప్తా అన్నారు. ఆదివారం ఇంజనీరింగ్ డే సందర్భంగా బోధన్ పట్టణంలో ఇంజనీర్‌లను వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఇంజనీర్ల సేవలు దేశానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు పబ్బ మురళి, మాశెట్టి నర్సయ్య సెటు, బిళ్లకంటి అనిల్ కుమార్, సభ్యులు, ఇంజనీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: ఇంజనీర్స్ డే సందర్భంగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మకరంద్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం తన చదువును ఉపయోగపడే విధంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య పనిచేశారని అందుకే ఆయనకు భారతరత్న ఇవ్వడం జరిగిందన్నారు. ఒకలక్ష్యాన్ని నిర్ధేశించుకొని ముందుకు వెళితే ఉత్తమ ఇంజనీర్ అవుతారని అన్నారు.ఈసందర్భంగా కళాశాల టాపర్స్‌కు గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లను, మెమొంటోలను అందజేశారు.నగదు అవార్డును సైతం అందజేశారు.ఈకార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు బాలనర్సింలు, ప్రధాన కార్యదర్శి తోటరాజశేఖర్, మోహన్‌కుమార్, సత్యనారాయణ, గణేష్, వినోద్, ప్రిన్సిపాల్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథ పురం ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్‌లను లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించి వారు చేసే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, సభ్యులు రఫీగోహర్, అంబల్ల తిరుపతి, ద్యాగ ఉదయ్, బైరి శ్రీదర్, రాక్సీ రమేష్, విజయశాంతి, పోల మధుకర్, కోల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి'



బోధన్‌లో నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,సెప్టెంబరు 15: ప్రజలు గణేష్ మండపాల్లో నవరాత్రులు పూజలు చేసిన విఘ్నేశ్వరుడి శోభాయాత్రను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ భీముని గుట్టలో రాకాసిపేట్ సార్వజనిక్ గణేష్ మండలి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమన్వయంతో కలిసిమెలిసి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీర్వదం వల్ల రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. బోధన్ ప్రజలందరు ఐక్యమత్యంతో కలిసి మెలిసి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా అధికారులు నిమజ్జనం అయ్యేంత వరకు శోభాయాత్ర వెంట ఉండాలని సూచించారు. సార్వజనిక్ గణేష్ లడ్డును రూ.12,200లకు రాకాసిపేట్‌కు చెందిన గుంజరి రాములు వేలంపాటలో దక్కించుకున్నారు. అనంతరం పసుపు వాగు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ విఠల్, కమిషనర్ వెంకట్ నారాయణ, నాయకులు గంగాధర్ రావు పట్వారీ, హరికాంత్ చారి, గుంజరి రాములు, గుండెటి శంకర్, గ్రామ పెద్దలు బాగారెడ్డి, శరత్ రెడ్డి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథునికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో తొమ్మిదో రోజు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. బొజ్జగణపయ్యకు వీడ్కోలు పలుకుతూ భజన కీర్తనలతో ఊరేగింపుగా తీసుకొనివెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఆదివారం గణనాథుడి శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. ఉమ్మడి మండలంలోని 38గణేష్ మండపాల నుంచి గణనాథుడి శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది. శోభాయాత్రలో విద్యార్థులు,యువకుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణనాథుడిని స్థానిక చెరువులలో నిమజ్జనం చేశారు.శోభయాత్రలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రెంజల్: 9రోజులు నిత్యపూజలు అందుకున్న లంబోదరుడిని తల్లి గంగమ్మ చెంతకు భక్తులు భక్తిశ్రద్ధలతో తరలించారు. ఆదివారం 9వ రోజు కావడంతో ప్రత్యేకంగా గణనాథులను అలంకరించి గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా డప్పువాయిద్యాలు, భజనలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి లంబోదరుడిని నిమజ్జనానికి తరలించారు. దండిగుట్ట గ్రామంలో ఉదయం నుంచి గణేష్ విగ్రహం ఊరేగింపును నిర్వహించారు. వాడవాడలా వినాయక విగ్రహాన్ని మంగళహారతులతో దండియా ఆడుతూ ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని బాగేపల్లి, కూనేపల్లి, కిసాన్‌తండా, కందకుర్తి గ్రామాల్లో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనశోభాయాత్ర జరిగింది. శోభాయాత్ర ఏర్పాట్లను ఎస్ఐ సాయన్న పర్యవేక్షించారు.

సిరికొండ: సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో ఆదివారం వినాయకుల నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. మండలంలో 161 వినాయకుల మండపాలు ఉండగా ఆదివారం నాడు భక్తులు, వినాయక మండపాల సంఘాల సభ్యులు సుమారు నలుబై వినాయకులు నిమజ్జనం చేశారు. ట్రాక్టర్లపై పూలతో అందంగా అలంకరించి వినాయకులను ఊర చెరువులోకి నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనంసందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిరికొండ ఎస్సై ఎల్.రామ్ తమ సిబ్బందితో బందో బస్తూ నిర్వహించారు.

మెండోర: మండలంలో తొమ్మిది రోజుల పాటు గ్రామల్లో మండపాల్లో శోభయమానంగా కొలువుదీని గణనాథులు నిమజ్జనోత్సవం డప్పుచప్పుళ్ల ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ గ్రామల సమీపంలో చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మండలంలో మెండోర, కోడిచర్ల, సావెల్, పోచంపాడ్, వెల్కటూర్, బుస్సాపూర్, చాకిర్యాల్, దూదిగాం, సోన్‌పేట్ గ్రామాల్లో వినాయకులకు గణేష్ మండపాల నిర్వాహకులు నిమజ్జనం చేశారు. మండలంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై నారాయణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

డిచ్‌పల్లి: పలు గ్రామల్లో గణేశ్ నిమజ్జనం తొమ్మిదో రోజు అయిన ఆదివారం రాత్రి నిమజ్జనానికి భారీ విగ్రహలను బాసరా గోదావరికి, చిన్న చిన్న విగ్రహలను చెరువులు, కుంటాలకు వాహనాల్లో తరలిం చారు. నవరాత్రులు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడికి నిమజ్జనానికి తరలుతున్న సమయంలో వాహనాలను విద్యుత్ దీపాలతో సర్వంగ సుంద రంగా ముస్తాబు చేశారు. గ్రామాల్లోని చెరువులు, కుంటాల్లో నిమజ్జ నానికి వీడీసీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేయించారు. ఘన్‌పూర్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. డిచ్‌పల్లి, మండల కేంద్రంతో పాటు ఘన్‌పూర్, ఖిల్లా డిచ్ పల్లి, మిట్టపల్లి, రాంపూర్,దూస్‌గాం, కమలపూర్, మెంట్రాజ్‌పల్లి గ్రామాల్లో ఆనందోత్సవాల మధ్య గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లాయి.గ్రామస్తులు హా జరై ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీసభ్యులు పేర్కొన్నారు.

మోపాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. 9రోజుల పాటు గణేష్ మండపాల వద్ద గణేష్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గణేష్ నిమజ్జనం కావడంతో ఆయా మండపాల నిర్వాహకులు గణేష్‌లను రథోత్సవాలపై తీసుకెళ్లి గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు. భోర్గాం(పి) వీడీసీ ఆధ్వర్యంలో గణేష్ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ మందిర్ నుంచి గణేష్ రథోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రథంలో ఆయా మండపాల వారు గణేష్‌లను రథంలో పెట్టి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వీడీసీ పెద్దలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ యువకులు, మహిళలు మంగళ హారతులతో నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, మంచిప్ప, బాడ్సి, మోపాల్, కంజర్, కులాస్‌పూర్, చిన్నాపూర్, ఠాణాకుర్దు, తదితర గ్రామాలలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గ్రామ చెరువుల వద్ద వీధి దీపాలను ఏర్పాటు చేశారు.



మెండోరలో వినాయకుడి నిమజ్జనం చేస్తున్న యువకులు



కోటగిరిలో శోభాయాత్రలో చిన్నారుల కొలాటం ప్రదర్శన

ఘనంగా ఓనం పండుగ



ఓనం పర్వదినం సంధర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిన్నారులు, విద్యార్థులు

డిచ్‌పల్లి,సెప్టెంబరు 15: ఓనం పేరు వింటేనే చాలా మంది మళయాళీలలో మది పులకరిస్తుంది. ఈ సాంప్రదాయనికి వారసాత్వనికి చిహ్నం ఈ పండుగ. తెలంగాణ ఏడో పోలీస్ బెటాలియన్ పక్కన గల విక్టరీ పాఠశాలలో ఓనం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు.మళాయాళీల నుంచి ఓనం వేరు చేయడం శరీరం నుంచి గుండె కాయను తొలగించినట్లేనని కేరళ సంప్రాదాయలను తరతరాలుగా ఈఓనం పండుగను నిర్వహించుకుంటారని పాఠశాల కరస్పాండెంట్ ఉపగంగాధర్ ప్రిన్సిపాల్ సుజ, దివ్యే తెలిపారు. 37ఏళ్లుగా తమ పాఠశాలలో ఈ ఓనం వేడుకలునిర్వహి స్తు న్నట్లు పేర్కొన్నారు. చదువు, ఉద్యోగ రీత్య సొంత ప్రాంతాలను వదిలి నిజా మా బాదు జిల్లాకు వచ్చిన కేరళ సంప్రాదాయలు పాటిస్తున్నమనిఈ పండగను ఇక్కడ సైతం ఆనందంగా జరుపుకుంటాన్నట్లు తెలిపారు. భిన్నత్వంలో ఏకాత్వం మనకే సొంతమని రుజువు చేశారు.విద్యార్ధినుల సంస్కతిక ప్రదర్శనలు, ఆటలు, పాటాలు అలంరిం చా యి. వైవిధ్య రకాల వంటకాలు, తయారు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఓనం పండగా మహబలి ఆశోకచక్రవర్తి తనపాలనలో కేరళను కంటికిరెప్పల కాపాడికీర్తి సాధించారు.

నవీపేట: మండల కేంద్రంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓనం పండుగ సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహానికి అన్నంతో పాటు వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు శశాంక్ జోషి తదితరులున్నారు.

కొత్తపల్లిలో భారీగా పలికిన గణేష్ లడ్డు వేలం



లడ్డును దక్కించుకున్న వెంకట్ రెడ్డి దంపతులు

కోటగిరి,సెప్టెంబరు 15: కోటగిరి మండలంలోని కొత్తపల్లి క్యాంప్‌లో ఆదివారం గణేష్ మండపం వద్ద లడ్డు వేలంపాట నిర్వహించారు. 10వేల నుండి లడ్డు వేలం ప్రారంభించగా గ్రామానికి చెందిన లక్కు వెంకట్ రెడ్డి లక్ష 10వేల 100 రూపాయలకు లడ్డును వేలంలో దక్కించుకున్నారు. గణేష్ మండలి నిర్వాహకులు వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులను సన్మానించి లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, కొండారెడ్డి, పాల్గొన్నారు.

ఎడపల్లిలో రథం అందజేత

ఎడపల్లి, సెప్టెంబరు15:ఎడపల్లి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాటు చేసే వినాయక మండపానికి ఆదివారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కందగట్ల రాంచందర్ రథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నయాబాదిలో గల మహాలక్ష్మి మందిరంలో ఏర్పాటు చేయు గణేష్ ఉత్సవానికి, దేవి నవరాత్రి ఉత్సవాల అనంతరం శోభాయాత్ర చేయడానికి రథాన్ని తను స్వంతంగా సుమారు లక్ష రూపాయల వ్యయంతో తయారు చేయించి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శంకర్ నాయుడు, ఎల్లయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

తిర్మన్‌పల్లిలో యువత రక్తదానం

ఇందల్వాయి, సెప్టెంబరు 15: ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఆదివారం యూత్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో యువత ముందుకు వచ్చి రక్తదానం చేశారు. గ్రామంలోని యువకులంతా రక్తదానంలో పాల్గొని రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది సుమలత, పోతన్న, గంగాధర్, తిర్మన్‌పల్లి యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

నేటి ధర్నా కార్యక్రమం వాయిదా

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు15: ఈనెల 16వ తేదీన ఆర్మూర్ తహ సీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు బోర్డు ఉద్యమకారుడు ముత్యాల మనో హర్‌రెడ్డి మృతి చెందడం, మిలాద్-ఉన్-నబి సందర్భంగా ప్రభుత్వం సోమవారం సెలవుదినం ప్రకటించడం, గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఉండడం వల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు మెమోరాండం అందజేసే కార్యక్రమం వాయిదా వేశామన్నారు. తిరిగి ఈ కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీన గురువారం నిర్వ హించ తలపెట్టినట్టు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74800	రూ.69050	రూ.895

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ప్రేమికుడు (10.00)
: మత్తు వదలరా (1.30, 7.45, 10.45)
: స్త్రీ-2 (4.30)
స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (12.15, 7.00)
: సరిపోదా శనివారం (3.25, 10.10)
స్క్రీన్-3 : భలే ఉన్నాడే (10.25, 7.30)
: 35-చిన్నకథ కాదు (1.25, 10.30)
: మత్తు వదలరా (4.30)
స్క్రీన్-4 : ఉత్సవం (11.00, 7.15)
: తుంబ్బడ్ (హిందీ) (2.00)
: కలింగ (4.40)
: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు) (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 3 (తెలుగు) (10.20)
: సరిపోదా శనివారం (1.25, 7.20)
: మత్తు వదలరా (4.35)
: 35-చిన్నకథ కాదు (10.30)
స్క్రీన్-2 : మత్తు వదలరా (10.45, 1.30)
: ఏఆర్ఎం (తెలుగు 3డి) (4.20)
: 3 (తెలుగు) (7.30, 10.30)
స్క్రీన్-3 : 35-చిన్నకథ కాదు (10.50, 1.50)
: 3 (తెలుగు) (4.35)
: మత్తు వదలరా (7.40, 10.30)

దేవి : మత్తు వదలరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఆర్ఎం (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్